# సంపాదన

కామారెడ్డిలో బస్సు దిగగానే గుర్తొచ్చింది రామన్న ఆటో.

'రామన్న ఈ కాలంలో ఉండాల్సినవాడు కాదు. కష్టపడి పనిచేస్తాడు. దీనికి తోడు లౌక్యం ఉంటే ఏనాడో లక్షాధికారి అయ్యుండేవాడు. లక్షేంటి, ఎన్నో లక్షలు వెనకేసేవాడు. నేనూ ఇక్కడే ఉంటే ... నా పరిస్థితీ ఇంతకంటే తీసిపోయేదేం కాదు. అన్నీ సరిగ్గా కలిసొస్తే లెక్చరర్నో, టీచర్నో అయ్యుండేవాడ్ని. కాలం కరుణించలేదు. ఆటో తోలడం నాకూతప్పలేదు. కానీ, రామన్నకూ నాకూ చాలా తేడా ఉంది. నేను సంపాదించే దాంట్లో పదోవంతైనా ఉండదు రామన్నది. అతను కూడా హైదరాబాద్ వస్తే కనీసం నా అంత గాకున్నా సగమైనా సంపాదించుకునేవాడు ...' ఆలోచిస్తూ నిజాంసాగర్ రోడ్ చౌరస్తా చేరుకున్నాను. అక్కడ రాజు కనిపించాడు.

మేమిద్దరమూ క్లాస్‌మేట్స్‌మే - ఇంటర్‌దాకా. వాడు ఓరియంటల్ కాలేజీలో చేరి, ఆయాచితం నటేశ్వర శర్మగారి ఆశీస్సులతో అధ్యాపకుడయ్యాడు. వానికంటే ఎక్కువ మార్కులు సంపాదించే నేను, కాలేజీ మానేశాను. అదృష్టానికి దురదృష్టానికి మధ్యన ఓ రేఖ ఉంటుందట గదా ! అలాంటిదేదో మమ్మల్ని వేరు చేసింది. నాన్న హఠాన్మరణం కుటుంబ భారమనే కాడిని నామెడమీద వేసింది. ఆటో నడపటం బతుకు బండి లాగడం తప్పనిసరైంది.

"ఒరేయ్ సుభాస్ !" రాజు నన్ను చూసి గుర్తుపట్టి అరిచాడు.

రోడ్డు కవతల పక్కనున్నాడు. చుట్టూ విద్యార్థుల మధ్యన చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోతున్నాడు. నన్ను చూళ్ళేడేమో లే' ఎందుకు అనవసరంగా గతాన్ని తోడుకొని



బాధపడటం. పైగా ఇప్పుడు ఇంటికెళ్ళే తొందర ... అనుకుంటున్న నా అభిప్రాయాన్ని చెదరగొట్టాడు. పరుగులాంటి నడకతో నను చేరుకున్నాడు.

"ఏరా ! అంజాన్ గొడుతున్నవు ..." గట్టిగా నన్ను పట్టుకున్నాడు.

"నేనా ! అప్పటినుండీ జూస్తున్నా. బిజీగా ఉన్నావ్ గద. పైగా నువ్వు లెక్చరర్‌వి. మేమెక్కడ గుర్తుంటం వయా !" నా గొంతు నిష్ఠూరాన్నొలికింది.

"బలేవాడివే హుల్టా బజాయిస్తున్న వేంది ? అయినా, ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే ... నేను లెక్చరర్‌నైనా నీ స్నేహితుడ్నే. సంపాదనలో నీకంటే తక్కువే".

"అగొ ఇదేం ఫిట్టింగు మళ్ళీ ?" ఆశ్చర్యపోయాన్నేను. "ఇస్త్రీ నలగకుండా వేలకొద్దీ సంపాదించేది నువ్వు. పదో-పరకో ఏరుకునేవాళ్ళం మేము ..."

"అబ్బా ! ఎందుకన్నా ఎక్కిరిస్తవు ? మా జీతం ఎప్పుడూ గొఱ్ఱె తోక బెత్తెడే. గవర్నమెంట్ ఎంప్లాయీస్ కైతే కనీసం అడపా దడపా జీతాలు పెరుగుతాయ్. మాకేముంది ? ప్రైవేటు కాలేజీలు. ఎంత ఇచ్చినా తీసుకోవాలె. ఎవనికోపమొచ్చినా మానేయాలె ..."

నిజమేననిపించింది నాకు. అయినా హోదా హోదాయే గదా ! అదే అన్నాను రాజుతో.

"ఆదాయం లేని హోదా ఏం జేసుకోను బై. నువ్వు హైదరాబాద్‌లో రెండు ప్లాట్లు కొన్నావని తెలిసింది. నేనింకా కామారెడ్డిలోనే కిరాయి ఇంట్లో అవస్థపడుతున్నాను ..."

నా భుజాలు పొంగాయి, నాకు తెలియకుండానే. అంతలోనే రాజు ఆదివారం రోజూ తప్పని కాలేజికి తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు. ఇటు రామన్న ఆటో కూడా వచ్చింది.

"తాడ్వాయి - చిట్యాల - సంతాయిపేట ..." సికింద్రాబాద్‌లో పండ్లమ్ముకునే వాడిలా అరిచాడు రామన్న - ఉరఫ్ - రామారావు.

"ఆఁ ! చిట్యాలకు ఫిరీగ దీస్కపోతావా ?" వెనక నుండి వెళ్ళి వ్యంగ్యంగా అడిగాను.

గబుక్కున తిరిగి నన్ను చూసి ఆశ్చర్యపోయాడు రామన్న. అంతలోనే తేరుకొని "సుభాస్ !" గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు.

నాకు ఇబ్బంది అనిపించింది. అతని మురికి ఎక్కడ అంటుకుంటుందోనని భయమేసింది. ఇందాక రాజు కౌగిలించుకున్నప్పుడు సౌకర్యం. ఇప్పుడు అసౌకర్యం ! మెల్లిగా విడిపించుకొని కుశల ప్రశ్నలడిగాను.

"హైదరాబాద్ రమ్మంటే వినవు !" అతని దీనస్థితికి చిరాకు పడ్డాను.

"ఏదో భాయ్. గిట్లా అలవాటైపోయింది. బాయిల కప్పల్లాగ ఈ నేల, ఈ నీరు, ఈ మనుషుల్నీ వదిలి బతకలేను ..."

"రామన్నా ! అర్జంట్ ...పదపద !ధర్మాజివాడి బోవాలె". ఓ పంచెకట్టు మనిషి పుసుక్కున ఆటోలో కూచొని తొందర పెట్టాడు.

ఆ మనిషిని చూసినట్టే ఉందిగానీ పేరు గుర్తుకు రాలేదు. అయినా పేర్లు గుర్తుపెట్టుకొని, పరిచయాలు పెంచుకోవడం మన పద్ధతి కాదు. ముక్కుపిండి కిరాయ వసూలు చేసుకునే వాళ్ళం. వంగతోట కాడ వరస కలిపి, భంగపాటు చెందటం ...'అలవాటు లేదు. ఇక్కడ ఆటో నడిపి, ఈ మనుషుల్తో విసుగెత్తే కదా హైదరాబాద్ చేరుకున్నది. అక్కడి ఆటోల తీరే వేరు. ఎంతైనా హైదరాబాద్ హైదరాబాదే, కామారెడ్డి కామారెడ్డే ...

"ఏందన్నా అర్జెంటు ? మీ ధర్మాజివాడోళ్ళని నమ్మొద్దు. పైసలు సక్కగియ్యరు". విసుక్కున్నాడు మెత్తగా రామన్న.

"ఎంత మాటన్నావన్నా ?" ఖంగుతిన్నాడా మనిషి. "ఎన్ని పైసలు గావాలె చెప్పు?" జేబులోంచి నోట్ల కట్టలు తీశాడు.

"అబ్బో ! నీ దగ్గరనే ఉన్నయ్ పైసలు. నేనేమన్నా పుణ్యానికడిగిననా ? కిరాయలు సరిగ్గ ఇయ్యమన్నగంతే ?"రామన్న ఆత్మాభిమానం.

"పద రామన్నా ! శానా అర్జెంటు. మా పెద్ద నాయనకు బాగలేదు. ఇదో మందులు దీస్కపోతన్న ..." చేతిలోని క్యారీబ్యాగ్ చూయించాడు.

కరిగిపోయాడు రామన్న. నిట్టూరుస్తూ తన సీట్లో కూచొని స్టార్ట్ చేశాడు. "రా సుభాన్ !" కూచొమన్నట్టు పిలిచాడు.

నాకు బాధనిపించింది. ధర్మాజివాడి దాకా ఒక్క ప్యాసెంజరును కూచొబెట్టుకుని ఆటో తోలడమంటే కోరి నష్టాన్ని ఆహ్వానించడమే. అతనిచ్చే మూడో నాలుగో రూపాయల కోసం ముప్పై నలభై రూపాయల ఖర్చు. నేనూ చిట్యాల దాక వెళ్తున్నా, అయినా నా వద్ద అతను డబ్బులు తీసుకోడనేది నిజం.

కృష్ణాజివాడి, లింగాజిపూర్‌లలో కూడా ఎవరూ ఎక్కలేదు. ఆటో ధర్మాజివాడిలో ఆగగానే ఆ మనిషిదిగి, ఆదరాబాదరాగా వెళ్తున్నాడు.

"అరె ! నారాయణా ! పైసలియ్యకుండ గట్లవోతవేంది ?"అరిచాడు రామన్న.

"అరె ! చిల్లర లేవునయా ! నేనేమన్నా ఊరొదిలి పారిపోతున్నానా ? ఈసారి గలిసినప్పుడిస్తతియ్ !" వెనక్కి కూడా చూడలేదు నారాయణ.

"నాకు ముందే దెలుసు నీసంగతి !" గొణుక్కుంటూ ముందుకు సాగాడు రామన్న.

నాకు కోపం, బాధ, జాలి ఒకేసారి కలిగాయి. దాదాపు ఖాళీ ఆటో వెళ్తున్నట్టే.

"రామన్నా ! నీ అమాయకత్వాన్ని, మంచితనాన్నీ ఇక్కడి జనాలు క్యాష్ చేసుకుంటున్నారు. నామాట విని హైదరాబాద్ వచ్చేయ్. మీటరు ఆటోలో ఎంతో లాభముంటుంది. పైగా నీది సొంత ఆటో. రోజూ నీకు చేతనైనంత సంపాదించుకోవచ్చు" హితబోధ చేశాను.

"కరక్టే ! అదేపని జేయాలి ..."

రామన్న నుండి నేనూహించని జవాబది. సంతోషమనిపించింది.

ఆటో దేవాయిపల్లి గేటు దాటుతుండగా ఊళ్ళో నుండి వస్తూన్న నలుగురైదుగురు మనుషులు గట్టిగా అరిచారు. 20–25 గజాలు ముందుకు వెళ్ళి ఆటో మళ్ళీ రివర్సు గేరులో గేటుదాకా వచ్చింది. 'గుడ్డిలో మెల్ల. ఎవరూ లేరనుకుంటున్న సమయంలో కనీసం తాడ్వాయి దాకా నలుగురైదుగురు దొరికారు'.

మరుక్షణమే నా ఆనందం ఆవిరైంది. వాళ్ళు వస్తున్నది తాడ్వాయి కాదు, కామారెడ్డి వెళ్తారట. అందులో ఓ పసివాడ్ని ఎద్దు కుమ్మిందట. వానికి సీరియస్‌గా ఉంది, ఆసుపత్రికి తీసుకెళ్ళాలి, వెనక్కెళ్దామని రామన్న నడిగారు.

బాగానే ఉంది. వాళ్ళు అవసరంలో ఉన్నారు. ఆటో అర్జెంటు పనిమీద చిట్యాల వెళ్తున్నది, వెనక్కి కామారెడ్డి వెళ్ళాలంటే మూడొందలైనా కావాలని డిమాండ్ చేయొచ్చు. కనీసం రెండొందలైనా ఇవ్వకపోరు.

ఆటో వెనక్కి తిరిగింది. 'సుభాష్ ! తొందర లేకుంటే నువ్వూ కామారెడ్డి దాకా వచ్చేయ్. వీళ్ళని వదిలేసివద్దాం !' అన్నాడు రామన్న. 'సరేలే' అనుకుంటూ అట్లాగే కూచున్నా.

ఆ వచ్చిన అయిదుగురిలో ఇద్దరు ఆటోలో కూర్చున్నారు. 'ఆ పిల్లవాడ్ని ఎత్తుకొని'. బాబు ఎనిమిదేళ్ళ వాడు గాబోలు.

ఆటో చౌరస్తాలో ఆగింది. ఆసుపత్రి దాకా రమ్మని రిక్వెస్టు చేశారు వాళ్ళు. బస్టేషన్ దాకా వెళ్ళాం. ఒకవేళ అక్కడ డాక్టర్ కాదంటే హైదరాబాద్ వెళ్ళడానికైనా అనువుగా ఉంటుందని వాళ్ళ ఉద్దేశ్యం. ఓ ప్రైవేటు హాస్పిటల్ దాకా వాళ్ళను చేర్చాం.

వాళ్ళు ఆటోదిగి పదిరూపాయలు రామన్న చేతిలో పెట్టారు. ఎగాదిగా చూశాడు రామన్న.

'ఇంకేంది' ? పెద్దాయనన్నాడు రామన్నను చూసి, 'చాలదా' ? అన్నట్లు.

'పిల్లగాని కిరాయి' ? రామన్న డిమాండు.

మరో రెండ్రూపాయలనోటు రామన్నకిచ్చి, వాళ్లు ఆ అబ్బాయిని తీసుకొని ఆస్పత్రిలో కెళ్ళారు.

'రామన్నా ! నీలాంటి వాడ్ని ఆ దేవుడు కూడా బాగుపరచలేడనుకున్నాను మనసులోనే.

* * *

గాంధీ హాస్పిటల్ ముందు ప్యాసింజర్లెవరైనా దొరుకుతారేమోనని చూస్తున్నాను. తాడ్‌బండ్ నుండి నుండి ఓ ఎమర్జెన్సీ కేసు తెచ్చి రెండు వందలు పిండుకున్నాను. హాస్పిటల్ కదా ! ఏదో ఓ కేసు దొరక్కపోదు.

సడన్‌గా నా దృష్టి బస్‌స్టాపులో నిలుచున్న వ్యక్తిపై పడింది. అతను ధర్మాజివాడి మనిషి. నెలరోజులకింద కామారెడ్డి వెళ్ళినపుడు ఆటో కిరాయి ఇవ్వక రామన్నకు టోకరా ఇచ్చిన ఘనుడు నారాయణ. 'ఇక్కడెందుకున్నాడో' అనుకుంటూ పలకరించాను.

అతను నన్ను గుర్తుపట్టలేదు. ఆ ఏరియా మనిషిగా మాత్రం పోల్చుకున్నాడు.

"మా మనిషికొగాయనకు టక్కరైంది. గంట కింద ఆస్పిటల్‌ల జేర్పిచ్చినం..." చెప్పాడు.

"ఆటోలోనే వచ్చారా ?" నాకు రామన్న గుర్తుకొచ్చాడు. రామన్నను వీళ్ళు ఇంత దూరం తీసుకురాగలిగే ఘనులే. అనేకంటే అడిగితే చాలు, ఎక్కడికైనా చీపుగా వచ్చే అమాయక చక్రవర్తి రామన్న అనడం సబబు.

"ఆటోలనే వచ్చినం. మూడొందలు గుంజిండు ..." పొడిగా అన్నాడు నారాయణ.

"ఎంతమంది ?" అదేమంత గొప్పవిషయం కాదే ? పైగా సుమారు వంద కిలోమీటర్లు అనుకుంటూ అడిగాను.

"ఆరుగురం" అన్నాడు.

అదిరిపడ్డాన్నేను.

"ఇంతకీ యాక్సిడెంటెవరికైంది ?"

"ఆటో నడిపించేటాయినకే"

అయోమయంలో పడ్డాన్నేను - ఎవరతను ? అడిగాను.

ఎగాదిగా చూశాడు నన్ను. 'నీకెందుకోయ్ ?' అన్నట్టు.

"అయ్యా ! నేను కామారెడ్డి వాడ్నే. మాది చిట్యాల ... యాక్సిడెంటెవరికైందో చెప్పు అడిగాను - గొంతులో ఆందోళన ఒలకబోస్తూ.

"మా పక్కూరాయనే. ఆటో రామన్న ... అని... శానా మంచోడు"

నా కాళ్ళ కింద భూమి కదిలినట్టైంది. ఆ షాక్ నుండి తేరుకోడానికి సమయం పట్టింది. రెండు క్షణాల తర్వాత తేరుకుంటూ 'నేనతణ్ణి వెంటనే చూడా'లని నారాయణను తోడుగా తీసుకొని ఆసుపత్రిలోనికి పరుగెత్తాను.

ఎమర్జెన్సీ వార్డులో డాక్టర్లు రామన్నను పరీక్షిస్తున్నారు. బయట అయిదారుగురు మనుషులు చర్చించుకుంటున్నారు - 'దేవుని లాంటి మనిషి ! అతనికే ఆపదా రానీయకు తల్లీ ! శబరిమాతా ! అంతా నీదే దయ ... ! దండం పెట్టుకుంటున్నాడు ఆ తల్లిని తలచుకొని ఓ పెద్దాయన. "పాపం ! చిన్నోడయినా పెద్ద మనసున్నోడు. బంగారమసొంటి మనిషి. మంచోళ్ళను దేవుడు మంచిగనే జూస్తడు ... ఏంగాదు అతనికి" వాళ్ళలోనే ఒకడు ధైర్యం చెబుతున్నాడు.

"వాళ్ళ ఇంట్ల వాళ్ళెంత పరేషానైతున్నరో !" ఓ కుర్రాడు వాపోయాడు.

"పైసలేమన్నా తక్కువ బడుతయేమో ! నీ దగ్గరెంతుందిరా ?"

నారాయణనుద్దేశించి అడిగాడో పెద్దాయన.

"ఎంత గావాలె ? అంటూ నారాయణ జేబులోంచి డబ్బులు తీసి చకచకా లెక్కపెట్టి రెండు వేలిచ్చాడు - అతనికి.

"ఇంతకూ యాక్సిడెంటెట్లయింది ? అడిగాను నారాయణని.

"దేవునిపల్లి దగ్గర ఒగ పిల్లగాడు సైకిల్‌మీద సర్రున ఆటోముందరికొచ్చిండు. వాణ్ణి దప్పించవొయ్యి ఆటో పక్కకు దింపిండు. చెట్టుకు గుద్దుకున్నది. ఎవ్వరికి దెబ్బలు దగలలేదు. రామన్నకే నెత్తికి, మొకానికి చేతులకు బాగా దగిలినయ్ ..." చెప్పాడతను.

"డేంజరేమిలేదంట ..." ఓ కుర్రాడు ఎమర్జెన్సీ వార్డు నుంచి పరుగెత్తికొచ్చినట్టు చెప్పాడు.

"అరేయ్ ! స్వీటుదేపోరా ! అందరికి పంచుదం. అట్లనే వాళ్ళ అమ్మకు ఫోన్‌జేసి చెప్పుర్రి. ఏం ఫికరు జెయ్యొద్దని". పెద్దాయన ఆనందానికి అవధిలేదు.

నారాయణ ఆ పనిలో పడ్డాడు. ఒక్క మనిషి ! ఒక్క మంచితనం ! ఎంత ప్రతిస్పందన! నిజంగా మంచితనం మాసిపోలేదు. మాసిపోదు.

"రామన్నా ! నువ్వు చాలా గ్రేట్. ఎంత సంపాదించామన్నది కాదు ముఖ్యం. ఏం సంపాదించామనేదే ముఖ్యం!" మనసులోనే అనుకుంటూ, అతన్ని కలిసేందుకు ఎప్పుడు పర్మిషన్ దొరుకుతుందా ! అని ఎదురుచూడసాగాను.

❀❀❀

(ప్రజాతంత్ర, మార్చి 4-10, 2006)